క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే ప్రతాప్ ప్రచారం

నూజివీడు: వైఎస్సార్ సీపీ నూజివీడు నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మంగళవారం ముసునూరు మండలం కొర్లగుంట, కాట్రేనిపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు సోమవారం తెలిపాయి. సాయంత్రం 5 గంటల నుంచి ఆయా గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తారని, ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, సానుభూతిపరులు తరలిరావాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు విజ్ఞప్తి చేశాయి.

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం

విస్సన్నపేట: వైఎస్సార్‌సీపీ మండల కార్యాలయం స్థానిక రెడ్డిగూడెం రోడ్డులో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభోత్సవం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి సోమవారం తెలిపారు. వైఎస్సార్ సీపీ విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని), తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు చేతుల మీదుగా పార్టీ కార్యాలయం ప్రారంభిస్తారన్నారు. మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొవాలన్నారు.

తాగునీటి సమస్యపై సమీక్ష

జి.కొండూరు: ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలలో నీటి సమస్య ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలను చేపట్టినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని అన్ని గ్రామాలలో జరుగుతున్న తాగునీటి సరఫరాపై అధికారులతో ఎంపీడీఓ సమీక్ష జరిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం



తిరువూరు: ఖమ్మం జిల్లా నుంచి బాపులపాడు మండలం కొయ్యూరుకు అక్రమంగా తరలిస్తున్న తెలంగాణ మద్యాన్ని తిరువూరు పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్ర వాహనంపై 16 మద్యం సీసాలను తరలిస్తున్న పలగాని సత్యనారాయణను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. తెలంగాణ మద్యం తిరువూరు తీసుకువస్తున్న షేక్ మాలిక్ అనే వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నామని వివరించారు.

చటర్జీకి నివాళి

గంపలగూడెం: వందేమాతరం గీత రచయిత బకించంద్ర చటర్జీ వర్ధంతిని గంపలగూడెం మండల పెనుగొలనులో షిర్డీసాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాంతంత్రోద్యమంలో ప్రజలను చైతన్యరచే విధంగా రచించిన వందేమాతరం గీత విశిష్టత, గొప్పతనాన్ని సేవా సమితి సభ్యులు వివరించారు.

13న ప్రాంగణ ఎంపికలు

విస్సన్నపేట: ప్రముఖ బహుళజాతి ఔషధ సంస్థ హెటిరోల్యాబ్స్ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన స్థానిక వికాస్ పీజీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించనున్నట్లు వికాస్ విద్యాసంస్థల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి సోమవారం తెలిపారు. ఈ ప్రాంగణ ఎంపికలకు ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎనలిటికల్ కెమిస్ట్రీ, బీ ఫార్మసీ, పాలిటెక్నిక్ మెకానిక్ పూర్తి చేసిన వారు చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. వివరాలకు వికాస్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చల్లా సుధీర్ రెడ్డిని వ్యక్తిగతంగా కానీ, 98495 53107 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఎన్డీఏ కూటమిని ఓడించండి



ఏ.కొండూరు: ఎన్డీఏ కూటమిని ఓడించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ పిలుపునిచ్చారు. విస్సన్నపేట, ఏ.కొండూరు మండలాల మండల కమిటీ సమావేశం మండలంలోని చీమలపాడు గ్రామంలో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో శంకర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించే పార్టీలకే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. తిరువూరు నియోజకవర్గంలో ఉన్న కిడ్నీ బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే మైనార్టీలకు రక్షణ ఉండదన్నారు. కాంగ్రెస్ కూటమి బలపర్చిన అభ్యర్థిని గెలిపించాని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి మేకల డేవిడ్, నాయకులు టి తాతయ్య, జే శివాజీ, టి.కృష్ణయ్య, ఆదినారాయణ, వెంకటేశ్వరరావు, నాగుల్‌మీరా పలువురు పాల్గొన్నారు.

ఏ పార్టీలో ఉంటావో తెలియని నీవా విమర్శించేది?

వసంత విమర్శలను ఖండించిన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల



మాట్లాడుతున్న సర్నాల తిరుపతిరావు, పక్కన నాయకులు

మైలవరం: నీతి, నిజాయితీ, విలువలతో కూడిన రాజకీయం చేస్తే ప్రజల్లో గుర్తింపు ఉంటుందని, కానీ నీకులాగా పూటకో మాట చెబుతూ, ఊసరవెల్లి రంగులు మార్చినట్లుగా ఎప్పుడు ఏ పార్టీలో ఉంటావో తెలియని వసంత వెంకట కృష్ణప్రసాద్ వైఎస్సార్ సీపీని విమర్శించడం తగదని మైలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు హితవు పలికారు. మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో తిరుపతిరావు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌ను విమర్శించే అర్హత వసంత వెంకట కృష్ణప్రసాద్‌కు లేదన్నారు. నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అందరూ వైఎస్సార్ సీపీతోనే ఉన్నారని తెలిపారు. ప్రతి రోజు వారికి ఫోన్‌లు చేసి టీడీపీలోకి రావాలని ఒత్తిడి చేయడం తగదన్నారు. పైగా తాను అందరికీ ఫోన్‌లు చేసి వైఎస్సార్ సీపీలోనే కొనసాగాలని చెబుతున్నట్లు అవాస్తవాలు చెబుతున్నాడన్నారు. తాను మండలాల్లో నాయకులను కొనుగోలు చేస్తున్నట్లు చెబుతున్నాడని, ఇది రుజువు చేయాలని లేకుంటే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియాలో అవాస్తవమైన పోస్టులు పెట్టిస్తూ వికృతానందం పొందుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి వసంతకు లేదన్నారు. తన కంపెనీకి చెందిన బిల్లులు వసూలు చేసుకునే వరకు పార్టీలో ఉండి బిల్లులు పూర్తయ్యాక పార్టీని వీడి టీడీపీలోకి వెళ్లడం ఎంత వరకు సమంజసమో ప్రజలు గమనిస్తున్నారన్నారు. తాను పక్కా లోకల్ అని ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగానని, కానీ ఎక్కడి నుంచో వచ్చిన వసంతకు ముఖ్యమంత్రి జగన్ సీటు ఇచ్చిగెలిపిస్తే ఇప్పుడు వెన్నుపోటు పొడుస్తూ పార్టీ వీడి టీడీపీలో చేరడం ప్రజలు గమనిస్తున్నారని నియోజకవర్గం నుంచి త్వరలోనే ఓట్లతో తరిమికొడతారన్నారు. వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ పరిశీలకులు కర్ర హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రోజూ నియోజకవర్గంలో పర్యటిస్తూ ఓటర్లను కలుసుకుంటూ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు విజయానికి కృషి చేస్తున్నామని, ఓటర్లు తిరుపతిరావు పట్ల ఎంతో నమ్మకంతో ఉన్నారన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, నియోజకవర్గ పరిశీలకులు అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇసుక, బూడిద అమ్ముకున్నది వసంత, ఆయన బావ మరిది అని పేర్కొన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణ రెడ్డి, సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లలా పరుగులు పెట్టాయని నిన్నా మొన్నటి వరకు చెప్పిన వసంత కృష్ణప్రసాద్ నేడు పార్టీ మారి అభివృద్ధి జరగలేదని చెప్పడం అబద్ధమే సిగ్గు పడేలా ఉందని మైలవరం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అన్నారు. ఆయన వైఎస్సార్ సీపీలో ఉన్నప్పటి మాటలు, టీడీపీలో చేరిన తర్వాత మాటలు ప్రజలు గమనించాలని కోరారు. ఇబ్రహీంపట్నంలో సోమవారం మీడియా సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ రాజధాని విషయంలో సీఎం జగన్ మాట తప్పారని ఇప్పుడు చెబుతున్న వసంత కృష్ణప్రసాద్ మూడు రాజధానుల ప్రకటన సమయంలో ఎందుకు రాజీనామా చేయలేదని నిలదీశారు. వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా కేశినేని నాని, నాకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి బలపర్చాలని కోరారు. పట్టణ అధ్యక్షుడు జోగి రాము, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి, కోమటి కోటేశ్వరరావు, కుంచం జయరాజు, సందిపాము రవి జిల్లా నాయకులు నల్లమోతు ప్రసన్న బోసు, ఎస్.సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

56 మంది వలంటీర్ల రాజీనామా



ఎంపీడీవోకు రాజీనామా సమర్పిస్తున్న తునికిపాడు వలంటీర్లు

గంపలగూడెం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 56 మంది వలంటీర్లు ఎంపీడీవో నాగేశ్వరరావుకు సోమవారం రాజీనామా పత్రాలను అందజేశారు. తునికిపాడుకు చెందిన 19 మంది, ఊటుకూరుకు చెందిన 31 మంది, పెనుగొలను-1, 2 సచివాలయాలకు చెందిన ఐదుగురు, గంపలగూడెంకు చెందిన ఒక్కరు తమ రాజీనామాలు ఇచ్చారు. సేవాదృక్పథంతో పనిచేస్తున్న తమపై తెలుగుదేశం పార్టీ నాయకులు ఉద్దేశపూర్వకంగా ఎన్నికల కమిషన్‌ను ఫిర్యాదు చేశారని, ప్రజలకు సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు జరిగేలా పనిచేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గెలుపునకు తమ వంతు ప్రచారం వ్యక్తిగతంగా చేస్తామన్నారు.

చట్టవ్యతిరేక పనులకు పాల్పడవద్దు



మాట్లాడుతున్న ఏసీపీ మురళీమోహన్

తునికిపాడు(గంపలగూడెం): ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ఎవరూ చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడవద్దని మైలవరం ఏసీపీ ఎస్ మురళిమోహన్ తెలిపారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు తీసుకొనే చర్యల్లో భాగంగా గంపలగూడెం మండలం తునికిపాడులో సోమవారం పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు, ముఖ్యంగా రాజకీయపక్షాలు సహకరించాలన్నారు. యువత గొడవల్లో తలదూర్చి తమ బంగారు జీవితాలను పాడుచేసుకోవద్దని హితవు పలికారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన సందర్భంగా చట్టాలు చాలా కఠినతరంగా ఉంటాయని వివరించారు. తిరువూరు అబ్దుల్ నబీ, గంపలగూడెం ఎస్‌ఐ ఎస్ శ్రీను, పోలీసులు, కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

జగనన్నను మళ్లీ సీఎంను చేసేందుకు సిద్ధం కావాలి

- ఎంపీ కేశినేని నాని, మైలవరం అభ్యర్థి తిరుపతిరావు
- గొల్లపూడిలో ఇంటింటికీ ఎన్నికల ప్రచారం



మహిళతో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు

భవానీపురం (విజయవాడపశ్చిమ): సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలన కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో ఆయన్ని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సిద్ధం కావాలని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శ్రీనివాస్(నాని), మైలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం సాయంత్రం గొల్లపూడి బొడ్డురాయి సెంటర్‌లోని అంబేడ్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చివరి వ్యక్తి వరకు సంక్షేమ పథకాలను అందించాలన్నదే సీఎం జగనన్న ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని ఒక్క గొల్లపూడి గ్రామంలోనే సుమారు రూ.60 కోట్ల మేరకు చేపట్టిన అభివృద్ధి పనుల్లో చాలా వరకు పూర్తయ్యాయని, ఇంకొన్ని త్వరలో పూర్తి అవుతాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదని దుష్ప్రచారం చేస్తున్న ప్రతిపక్ష నాయకులకు గొల్లపూడి గ్రామమే నిదర్శనమని తెలిపారు.

దమ్మున్న నాయకుడు సీఎం జగన్..

నలభై ఏళ్ల ఇండస్ట్రీ, పద్నాలుగేళ్లు సీఎంగా చేశానని చెప్పుకునే చంద్రబాబు, ప్రజలకు ఏం మేలు చేశాడో చెప్పుకోలేని దుస్థితిలో ఉన్నాడని ఎంపీ కేశినేని నాని ఎద్దేవ చేశారు. సీఎం జగన్ నాయత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వలన మీ కుటుంబానికి మంచి జరిగిందనుకుంటేనే వచ్చే ఎన్నికల్లో తమ ప్రభుత్వానికి ఓటెయ్యమని అడిగే దమ్ము, ధైర్యం ఉన్న నాయకుడు సీఎం జగనన్న అని అన్నారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపట్ల దేశ వ్యాప్తంగా ప్రశంసలు కురిపిస్తుంటే, చంద్రబాబు అండ్ కో మాత్రం ఓర్వలేక బురద చల్లటమే పనిగా పెట్టుకున్నారని పేర్కొన్నారు. ఎన్నికల తరువాత చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు మూటాముల్లె సర్దుకుని తెలంగాణ రాష్ట్రానికి పరిమితం కావడం తథ్యమన్నారు.

సేవ చేసుకునే భాగ్యం కల్పించండి..

పేద కుటుంబం నుంచి వచ్చిన తనపై నమ్మకంతో సీఎం జగనన్న రానున్న ఎన్నికల బరిలో ఒక పెత్తందారుపై నిలబెట్టారని, మీరందరూ ఆశీర్వదించి గెలిపించి సేవ చేసుకునే భాగ్యం కల్పించాలని ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు విజ్ఞప్తి చేశారు. తన ప్రత్యర్థి మాదిరిగా తనకు వ్యాపారాలు, పరిశ్రమలు లేవని, కేవలం ప్రజా సేవకే తన జీవితాన్ని అంకితం చేస్తానని చెప్పారు. చంద్రబాబు చెప్పినట్లుగా అబద్ధాలు చెప్పలేమని, సీఎం జగనన్న సుపరిపాలన చూసి మళ్లీ ఆయన్ని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో గొల్లపూడి గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఓటు అడిగే హక్కు వైఎస్సార్ సీపీకే ఉంది

తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి స్వామిదాసు



గంపలగూడెంలో పార్టీ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న స్వామిదాసు

గంపలగూడెం: ప్రజలకు ఇచ్చిన మాట తప్పకుండా సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేసిన వైఎస్సార్ సీపీకి మాత్రమే ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు ఉందని తిరువూరు శాసనసభ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. గంపలగూడెంలో సోమవారం నిర్వహించిన పార్టీ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేశానని గొప్పలు చెప్పుకొంటున్న నారాచంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ప్రజల్ని తప్పుదోవ పట్టించేవిధంగా మేనిఫెస్టోను విడుదల చేయడం తప్ప అమలు పరచిన దాఖలాలు లేవన్నారు. ఓటర్లను మోసం చేయడమే ఆయన నైజం అని విమర్శించారు. 2019 ఎన్నికల సందర్భంగా వైఎస్సార్ సీపీ విడుదల చేసిన మేనిఫెస్టోను 99 శాతం అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి రాష్ట్ర ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మరో మారు అధికారంలోకి రావడం తథ్యం అన్నారు. ఎన్నికల్లో గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణశాఖ అధ్యక్షుడు కొత్తగుండ్ల నరశింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు కే శామ్యూల్, మండల పార్టీ అధ్యక్షులు చావా వెంకటేశ్వరరావు, పట్టణపార్టీ నాయకులు అల్లు కృష్ణారెడ్డి, గొర్ల రామిరెడ్డి, కొత్తగుండ్ల వంశీ, కోట కోటేశ్వరరావు, సువారపు చంద్రశేఖర్, బండి అచ్చియ్య, పీ హరికృష్ణ, మహిళా ప్రతినిధి కోట సునీత, పార్టీ జిల్లా కమిటీ నాయకులు సీహెచ్ నర్సారెడ్డి, జీ చెన్నకేశవరెడ్డి, కే వినయ్‌కుమార్, ఆలపాటి ఉమా, తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు: రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు, సామాజిక అసమానతల నిర్మూలనకే ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. సోమవారం తిరువూరు 8వ వార్డులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అత్యంత వ్యయప్రయాసలకోర్చి ప్రభుత్వం పేదలకందిస్తున్న సంక్షేమపథకాలను అడ్డుకోవాలని తెలుగుదేశం పార్టీ ప్రయత్నిస్తోందని, మళ్లీ వైఎస్సార్ సీపీనే గెలిపించాలని కోరారు. వైఎస్సార్సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, పీఏసీఎస్ అధ్యక్షులు గజ్జల సీతారామారావు, ఏరియా ఆసుపత్రి వైస్ చైర్మన్ రేగళ్ల మోహన్‌రెడ్డి, నగర పంచాయతీ కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, మోదుగు ప్రసాద్, మూడు దుర్గా, కాకర్లమూడి సుందరకుమార్, పరసా సత్యనారాయణ, ఇనపనూరి చిన్నారి, తంగిరాల వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గత్తం నాగేశ్వరరావు, ఆర్‌ఆర్‌కే చారి, దేవిశెట్టి బాలకృష్ణ, యరదేశి రామారావు, రాజ్ అహ్మద్, చంటి, చంద్రమౌళి, నల్లబోతుల సీతారావమ్మ, కుంచం విజయలక్ష్మి పాల్గొన్నారు.

టీడీపీ ఆర్యవైశ్య నేత వైఎస్సార్ సీపీలో చేరిక



సాంబశివ రాఘవేంద్రరావును ఆహ్వానించిన సర్నాల తిరుపతిరావు, తదితరులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి పట్టణానికి చెందిన ప్రముఖ ఆర్యవైశ్య నేత, టీడీపీ సానుభూతిపరుడు మారేమల్ల సాంబశివ రాఘవేంద్రరావు వైఎస్సార్ సీపీలో చేరారు. నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు పార్టీ కార్యాలయంలో సోమవారం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సామాజిక న్యాయం, సంక్షేమ పథకాల అమలు తనను ఆకర్షించాయని ఆయన తెలిపారు. సామాన్య రైతు కుటుంబానికి చెందిన సర్నాలకు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపిక చేయడంతో పార్టీలో చేరానని వెల్లడించారు. రానున్న ఎన్నికల్లో ఆర్యవైశ్య సామాజికవర్గం ప్రతినిధిగా తన విజయానికి కృషి చేయాలని సర్నాల కోరారు.

నూకాలమ్మ ఆలయంలో పూజలు..

కొండపల్లి బీకాలనీలోని నూకాలమ్మ ఆలయ జాతరలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు వేద ఆశీస్సులు అందజేశారు. రానున్న ఎన్నికల్లో విజయం సాధించాలని ఆశీర్వదించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య, కౌన్సిలర్ ఎం.దయాసాగర్, ఎంఏ.బేగ్, ఆనంద్, నాగరాజు, బుర్రి ప్రతా, జానీషరీఫ్, చంటి పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

ప్రతి ఒక్కరూ ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలి



పైడూరుపాడు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ శ్రీరమ్య,బిఎల్వోలు

పైడూరుపాడు(విజయవాడరూరల్): ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని అదనపు ఎలక్ట్రోరల్ నమోదు అధికారి, ఎంపీడీఓ ఎ.శ్రీరమ్య అన్నారు. సోమవారం పైడూరుపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద స్వీప్ యాప్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో మూడు పోలింగ్ కేంద్రాలు ఓటర్లకు అందుబాటులో ఉన్నాయని, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. దివ్యాంగులకు, 85 సంవత్సరాలపై బడి అనారోగ్యంతో మంచంపై ఉంటున్న వారు ఓటు హక్కు వినియోగం చేసుకునేందుకు ఎన్నికల సంఘం ఇంటివద్ద ఓటువేసే అవకాశాన్ని కల్పించిందన్నారు. అలాంటి వారు 12డీ ఫామ్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సెక్టార్ ఆఫీసర్లు, బూత్ స్థాయి అధికారులు(బీఎల్‌ఓ) అలాంటి వారిని గుర్తించి వారి ఇంటికి వెళ్లి దరఖాస్తు చేయించాలన్నారు. సచివాలయ కార్యదర్శి మహేష్, సెక్టార్ ఆఫీసర్లు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు. రాయనపాడు గ్రామంలో స్వీప్ అవగాహన కల్పించారు.

సరిహద్దు చెక్‌పోస్టుల్లో ఆకస్మిక తనిఖీలు



చెక్‌పోస్టు సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్‌ఈబీ ఏఎస్పీ రామకృష్ణప్రసాద్

తిరువూరు: ఆంధ్రా-తెలంగాణ రాష్ట్రాల సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ రామకృష్ణ ప్రసాద్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అక్రమ మద్యం, సారా తరలింపును అడ్డుకోడానికి చెక్‌పోస్టుల్లో నిరంతర నిఘా ఉంచాలని, అన్ని వాహనాలనూ తనిఖీ చేయాలని ఆదేశాలిచ్చారు. తిరువూరు రాజుపేట, గంపలగూడెం మండలం రాజవరం, విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లి సరిహద్దు చెక్‌పోస్టులను ఏఎస్పీ పరిశీలించి పలు సూచనలిచ్చారు. వేమిరెడ్డిపల్లి తండాలో కార్డన్ సెర్చ్ నిర్వహించి 200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి అజ్మీర కృష్ణవేణి, భూక్యా క్షత్రియల నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. చింతలపాడులో 25 మద్యం సీసాలను అక్రమంగా నిల్వ ఉంచిన చాట్ల లోకేశ్వరరావును అరెస్టు చేశారు. ఎస్‌ఈబీ సీఐ అశోక్, ఎస్‌ఐలు జగ్గారావు, రఘు పాల్గొన్నారు.

జెడ్పీమాజీ చైర్‌పర్సన్ సుధారాణి ప్రచారం



తిరువూరు మండలం లక్ష్మీపురంలో మాట్లాడుతున్న సుధారాణి

లక్ష్మీపురం(తిరువూరురూరల్): మండలంలోని లక్ష్మీపురంలో సోమవారం వైఎస్సార్ సీపీ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు భార్య జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి స్వామిదాసుకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. స్థానికుడైన స్వామిదాసు అందరికీ అందుబాటులో ఉంటారని, నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తారని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, పార్టీ నాయకులు యరమల రామచంద్రారెడ్డి, తాళ్ళూరి నవీన్, మామిడి కుటుంబరావు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి స్వామిదాసు, సూర్యనారాయణరెడ్డి

విస్సన్నపేట: రంజాన్ సందర్భంగా ముస్లింలకు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి స్థానిక నూజివీడు రోడ్డులో కల్యాణ మండపంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు చేతుల మీదుగా ఇఫ్తార్ విందు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, గ్రామ సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, వైస్‌ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, మాజీ వైస్‌ఎంపీపీ ఓలేటి దుర్గారావు, ఎంపీటీసీ సభ్యుడు జి. మల్లయ్య, సొసైటీ అధ్యక్షుడు రెడ్డి ముత్యాలరావు, ఏఎంసీ డైరెక్టర్ రెడ్డి శేషగిరి, కో ఆప్షన్ సభ్యుడు షేక్ జాఫర్‌బాబా, మాజీ కో ఆప్షన్ సభ్యుడు దస్తగిరి, వివిధ గ్రామాల వైఎస్సార్ సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పల్లెర్లమూడిలో హైస్కూల్ విద్యార్థుల ర్యాలీ

నూజివీడు: మండలంలోని పల్లెర్లమూడిలో జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సోమవారం పర్యావరణ పరిరక్షణపై వర్క్‌షాపును నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు చదలవాడ ఉమా వెంకట హనుమంతరావు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ ఏలూరు జిల్లా సమన్వయకర్త స్వర్ణ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సహజ వనరులను ధ్వంసం చేయకుండా వాడుకుంటూ తర్వాత తరాలకు అందించాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్లకార్డులను ప్రదర్శిస్తూ గ్రామంలో ర్యాలీని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కల్పిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. క్లస్టర్ కో-ఆర్డినేటర్ ఎన్.మధుసూదనరావు, ఉపాధ్యాయులు విజయరత్న బాబు, అక్కినేని స్వర్ణ, రమేష్, రాజభూషణరావు, పార్థసారథి పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ సూచనల మేరకు ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

అధికారికంగానే పూలే జయంతి నిర్వహించాలి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):గత 15 ఏళ్లుగా ప్రభుత్వమే జ్యోతిరావు పూలే జయంతిని నిర్వహిస్తుందని, ఈ ఏడాది కూడా అధికారికంగా నిర్వహించాలని బీసీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్వీ.రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ 11వ తేదీన జ్యోతిరావు పూలే జయంతి కాగా ఇంత వరకు అధికారులకు ఎటువంటి ఆదేశాలు జారీ కాలేదన్నారు. ఎన్నికల కోడ్‌ను నేపథ్యంలో ఆదేశాలు జారీ కాకపోవడంతో బాధకరమన్నారు. జనాభాలో 55 శాతం మంది ఉన్న బడుగు, బలహీన వర్గాలకు జ్యోతిరావు పూలే ఆదర్శప్రాయులని తెలిపారు. ఆయన జయంతిని ఘనంగా నిర్వహించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

వసంత చెంత.. వివాదాల సంత

- ఆయనకు ఎర..ఈయనకు ఎసరు
- వివాదాస్పదుల వలయంలా వసంత కోటరీ
- ఉమ వర్గంపై తాయిలాలు ఎరవేస్తున్న వసంత
- వసంత గూటికి దేవినేని వర్గీయుల వలసలు
- వివాదాల సంతగా మైలవరం టీడీపీ రాజకీయం



జి.కొండూరు : సీసా కొత్తది..కానీ అందులోని ద్రవపదార్థం పాతదే అన్నట్లు తయారైంది మైలవరం నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి. వైఎస్సార్ సీపీకి వెన్నుపోటు పొడిచి టీడీపీలో చేరిన వసంత వెంకటకృష్ణప్రసాద్ తన ఆధిపత్యాన్ని నిరూపించుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు పార్టీకి తలనొప్పిగా మారాయి.

ముఖ్యంగా ఆయన కోటరీపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఆయన చెంత ఉన్నోళ్లంతా వివాదాల సంతను తలపిస్తోందని ప్రజల అభిప్రాయం. వసంత దృష్టంతా ఇప్పుడు దేవినేని ఉమా వర్గీయులపై పడింది. తన వైపు తిప్పు కునేందుకు తాయిలాల ఎర వేస్తున్నారు. దీంతో ఒక్కొక్కరూ వసంత గూటికి చేరుతున్నారు. ఈ పరిణామాలతో ఇన్నాళ్లూ భుజం మోసిన టీడీపీ ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు దూరమవుతున్నారు. ఇవన్నీ వసంత వెంకటకృష్ణ ప్రసాద్ భవిష్యత్ రాజకీయానికి శాపంగా మారబోతున్నాయని సొంత పార్టీ నేతలే చర్చించుకుంటున్నారు. దేవినేని ఉమామహేశ్వరరావుకి రాజకీయ భవిష్యత్తు లేకుండా చేసిన ఆ నేతలే ఇప్పుడు వసంత గూటిలోకి చేరడంతో రానున్న రోజుల్లో వసంత పరిస్థితి దేవినేనికి పట్టిన గతే పట్టనుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

పరువు దక్కించుకునేందుకేనా?

వైఎస్సార్ సీపీకి వెన్నుచూపి టీడీపీలో చేరిన వసంతకు ఆదిలోనే స్థానిక టీడీపీ కేడర్ నుంచి నిరసన సెగ తగిలింది. ఈ క్రమంలో ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు ఆర్థిక బలంతో నాయకులను లొంగదీసుకోవడం ప్రారంభించారు. అయితే వసంత వెంకట కృష్ణప్రసాద్ తాయిలాలకు అధికార వైఎస్సార్ సీపీ నాయకులెవరూ లొంగకపోవడం విశేషం. మొన్నటివరకు వసంత వెంట ఉన్న అనుచరగణం ఆయన తీరుపై గుర్రుగా ఉన్నారు. వైఎస్సార్ సీపీని వీడేది లేదంటూ వసంతకు తేల్చిచెప్పేశారు. దీంతో నియోజకవర్గంలో తన బలం తగ్గిపోతుందని భావించి, పార్టీ అధిష్టానం వద్ద పరువు దక్కించుకునేందుకు దేవినేని ఉమా వర్గీయులపై కన్నేశారు. ఎర అస్త్రాన్ని ప్రయోగిస్తూ దేవినేనికి ఎసరు పెడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మారని ముఖచిత్రం..

తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న 2014–19 మధ్య కాలంలో నియోజకవర్గంలో ఇసుక, మట్టిని అక్రమంగా తరలించి కోట్లు కొల్లగొట్టిన నేతలే ఇప్పుడు వసంత వెంకటకృష్ణప్రసాద్ పక్కన చేరుతున్నారనే వాదన వినిపిస్తోంది. జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను వేధించిన నాయకులు, బుడమేరు అభివృద్ధి పేరుతో కాంట్రాక్టులు పొందిన వారు, ఎత్తిపోతల పథకాల పేరుతో కోట్లు దండుకున్న గణాన్ని వసంత వెంకట కృష్ణప్రసాద్ తన వెంట తిప్పుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నియోజకవర్గంతో పాటు పార్టీ అధిష్టానం దగ్గర తన ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు అందరినీ పోగేస్తూ అపప్రథ పాలవుతున్నారు. ప్రజా వ్యతిరేక ట్రాక్ రికార్డు ఉన్న నాయకులను తన వెంట చేర్చుకోవడంపై నియోజకవర్గ టీడీపీలోనే వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

స్వలాభమే..వారి వ్యూహం

వసంత వెంకటకృష్ణప్రసాద్‌కి మద్దతు తెలపాలంటూ దేవినేని ఉమా మహేశ్వరరావు ఇప్పటికీ తన అనుచరులకు బహిరంగంగా చెప్పలేదు. కాగా ఉమా అనుచరులు అటు ఆయన దగ్గరకు, ఇటు వసంత చెంతకు చేరడం ఆశ్చర్యకరం. వసంత వెంకటకృష్ణప్రసాద్ వ్యూహం రచిస్తే తమ అక్రమ కార్యకలాపాలను మళ్లీ కొనసాగించవచ్చనే ఆలోచనతోపాటు ఆర్థికంగా లబ్ధి పొందవచ్చనే భావనలో దేవినేని ఉమా వర్గీయులు ఉన్నారు. ఇలా మైలవరం నియోజకవర్గ టీడీపీలో జరుగుతున్న వింత పోకడలు టీడీపీ శ్రేణుల్లో తీవ్ర గందరగోళానికి గురిచేస్తున్నాయి.

ఓటమి తప్పదా..

రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాలకతీతంగా నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం పట్ల ప్రజలు పూర్తి విశ్వాసంతో ఉన్నారు. దీంతోపాటు మైలవరం నియోజకవర్గంలో ఐదేళ్లు అధికార వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా కొనసాగి, స్వప్రయోజనాల కోసం ఇప్పుడు టీడీపీలోకి మారిన వ్యక్తిగా బరిలోకి దిగుతున్న వసంత వెంకటకృష్ణప్రసాద్‌పై సర్వత్రా విముఖత వ్యక్తమవుతోంది. ఓవైపు సొంత పార్టీలోనే దేవినేని ఉమా వర్గం రూపంలో ఆటంకాలు ఎదురవుతున్నాయి. మరోవైపు వసంత చెంత చేరుతున్న వింత సంత ట్రాక్ రికార్డు ప్రభావం ఆయన్ను ఓటమి అంచులకు చేరుస్తున్నాయని విశ్లేషకుల నుంచి అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

క్లుప్తంగా

పన్ను చెల్లింపుపై ఐదు శాతం రాయితీ

నందిగామ: పురపాలక సంఘ పరిధిలో 2024–25 మొదటి, రెండో ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తిపన్నును వన్ టైం పద్ధతిలో చెల్లించేవారికి ఐదుశాతం రాయితీ సదుపాయం కల్పిస్తున్నట్లు నందిగామ మున్సిపల్ కమిషనర్ కె.హేమమాలిని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను చెల్లింపుదారులు ప్రతిరోజూ ఉదయం తొమ్మిది నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు మున్సిపల్ కార్యాలయంలోని పురసేవ కౌంటర్‌లో పన్నులు చెల్లించవచ్చన్నారు. ఈనెల 30వ తేదీలోగా చెల్లింపులు చేసేవారికి ఈ రాయితీ సదుపాయం వర్తిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

ముస్లిం మహిళలకు చీరల పంపిణీ



చిల్లకల్లు(జగ్గయ్యపేట): రంజాన్ పండుగ సందర్భంగా చిల్లకల్లు రెహమత్‌నగర్‌లోని 100 మంది నిరుపేదల ముస్లిం మహిళలకు జగ్గయ్యపేట ఆవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం చీరలు, సేమియా ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ట్రస్ట్ గౌరవాధ్యక్షుడు ఖాశీం సైదా మాట్లాడుతూ రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదన్నారు. నిరుపేదలకు ఏటా ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహకారం అందిస్తున్నామని వివరించారు. ముస్లిం మైనార్టీ పట్టణ అధ్యక్షుడు మొమిద్దీన్, నాయకులు రస్ హుసేన్, బాలసైదా, మూసా ట్రస్ట్ అధ్యక్షుడు నజీర్ మీరా, మత పెద్దలు లాల్‌జాన్, గౌస్, సుభానీ, తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ లారీ బోల్తా



గౌరవరం(జగ్గయ్యపేట): సిమెంట్ లారీ జాతీయ రహదారిపై నుంచి అదుపుతప్పి బోల్తాపడిన ఘటన గౌరవరం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే మండల సమీపంలోని అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారం నుంచి సిమెంట్ లోడుతో చెన్నైకి బయలుదేరిన లారీ, గ్రామంలోని జాతీయ రహదారి వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి హైవే నుంచి సర్వీస్ రోడ్డులోకి పల్టీ కొట్టింది. ఈఘటనలో డ్రైవర్ దాసరి శివనారాయణకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు డ్రైవర్‌ను 108 ద్వారా ఆస్పత్రికి తరలించారు. సర్వీస్ రోడ్డుపై లారీ పడిన సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. చిల్లకల్లు ఎస్ఐ సతీష్ పరిశీలించారు.

ముందస్తు ఉగాది వేడుకలు

గండ్రాయి(జగ్గయ్యపేట): గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో సందడి చేశారు. ఉగాది పచ్చిడి చేసి అందరికీ పంచిపెట్టారు. ప్రధానోపాధ్యాయుడు నేలవెల్లి రమేష్‌బాబు మాట్లాడుతూ తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ విశిష్టతను వివరించారు. ఉపాధ్యాయులు సుబ్బారావు, జ్యోతికుమారి, రమాదేవి, పద్మావతి, ముక్తేశ్వరరావు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



నూజివీడు: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని పెద్దగాంధీబొమ్మ సెంటర్‌లో బాటసారులకు మజ్జిగను పంపిణీ చేశారు. వాసవీక్లబ్ అధ్యక్షుడు వనమా వెంకటేశ్వరరావు తన తండ్రి రంగారావు జ్ఞాపకార్థం దాదాపు 600 మందికి మజ్జిగ పంపిణీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తాపం నుంచి ప్రజలను సేద తీర్చేందుకు మజ్జిగను పంపిణీ చేస్తున్నామన్నారు. వాసవీక్లబ్ జిల్లా నాయకులు తటవర్తి కుమార్, మానేపల్లి సతీష్, అత్తులూరి నళినీ మోహన్, గుడివాడ మురళీ పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): లారీ డ్రైవర్ అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. అంబాపురం పంచాయతీ పరిధిలో షేక్ ఖాదర్ బాషా, సాబీర దంపతులు నివాసం ఉంటున్నారు. ఖాదర్ బాషా లారీ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. ఈ నెల 2వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో బాషా నమాజుకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లారు. సాయంత్రం అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో చుట్టు పక్కల వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

అంకితభావంతో పని చేసే ఉపాధ్యాయులకు గుర్తింపు


నవభారతిని సత్కరిస్తున్న నాగేశ్వరరావు, సొసైటీ ప్రతినిధులు

గన్నవరం: వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక చింతలపేట ఎంపీపీ స్కూల్‌లో ఎల్ఎఫ్ఎల్‌హెచ్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన దాసరి నవభారతిని సోమవారం హెల్పింగ్ హ్యాండ్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బీఎన్నార్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయురాలుగా 40 ఏళ్లు అంకితభావంతో పనిచేసిన నవభారతి ఎంతో మంది విద్యార్థుల ఉన్నతికి పాటుపడ్డారని చెప్పారు. ఆమె సేవలను గుర్తించిన ప్రభుత్వంతో పాటు పలు సంస్థలు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో అవార్డులను అందజేశాయన్నారు. ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన ఆమె అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. విశ్రాంత అధ్యాపకులు గన్నె వెంకట్రావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర వైస్ చైర్మన్ జి.జయబాబు, సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్, స్పందన మానసిక వికాస కేంద్రం కార్యదర్శి రజిత, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించండి

నందిగామ ఆర్‌ఓ రవీంద్రరావు


మాట్లాడుతున్న నందిగామ ఆర్‌ఓ రవీంద్రరావు

నందిగామ: ఎన్నికలు పూర్తయ్యేంతవరకు ఎవరికి కేటాయించిన విధులు వారు సక్రమంగా నిర్వర్తించాలని నందిగామ ఆర్డీవో, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.రవీంద్రరావు ఆదేశించారు. పట్టణంలోని కేవీఆర్ కళాశాల ఆవరణలో సోమవారం సెక్టార్, రూట్ అధికారులకు ఎన్నికల విధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్‌ఓ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఈవీఎంల వినియోగం, మాక్ పోలింగ్, పీవో డైరీ తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రూట్ అధికారులు ఆయా విధుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులకు వారి విధులపై అవగాహన కల్పించారు. ఎన్నికలు సజావుగా పూర్తయ్యేందుకు సిబ్బంది అంతా సక్రమంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. సమావేశంలో నందిగామ, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు తహసిల్దార్లు వై.సరస్వతి, వి.సుస్వాగతం, కె.రాజాకిషోర్, జి.మురళీధర్, మున్సిపల్ కమిషనర్ హేమమాలిని, నియోజకవర్గ పరిధిలోని సెక్టార్, రూట్ అధికారులు పాల్గొన్నారు.

చక్కటి ప్రణాళికతో విద్యలో రాణింపు


ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేస్తున్న సహాయ భాస్కరన్ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యలో రాణించి విజేతగా నిలవాలంటే చక్కని ప్రణాళికతో పాటు, కఠిన శ్రమ, అంకితభావం అవసరమని ఆంధ్రా లయోలా కళాశాల ఫిజిక్స్ విభాగాధిపతి జి.సహాయభాస్కరన్ అన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే వీటిని అలవర్చుకుంటే ఉన్నత స్థానాలను అధిరోహించి బంగారు భవిషతను సొంతం చేసుకుంటారని చెప్పారు. మహాత్మాగాంధీరోడ్డులోని సెయింట్‌జాన్స్ పాఠశాల 39వ వార్షిక బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా అకడమిక్స్, కో కరిక్యులర్, స్పోర్ట్స్‌లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సహాయ భాస్కరన్ మాట్లాడుతూ విజేతగా నిలిచిన ప్రతి విద్యార్థి వెనుక ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషి ఎంతగానో ఉంటుందని చెప్పారు. విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించి , వారిని తీర్చిదిద్దేందుకు బాటలు వేస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రెసిడెంట్ టి.మోనికా సుమన్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సుమన్‌త్యాగరాజ్‌లు ప్రతిభ చూపిన చిన్నారులను అభినందించారు. కాగా 2023–24 విద్యా సంవత్సరంలో 10/10 జీపీఏ సాధించిన, వందశాతం హాజరు ఉన్న వారికి, క్రీడల్లో రాణించిన వారికి ప్రత్యేకంగా బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ డీన్ కెవి కళ్యాణి, ప్రిన్సిపాల్ చిల్లకూరి భారతి, అకడమిక్ కో ఆర్డినేటర్ బి పావని తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామికి విశేష పూజలు


పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమనవారిపేటలోని విజయదుర్గా రామలింగేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో సోమవారం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి రామలింగేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అనంతరం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో చండీహోమం, నిర్వహించగా, పలువురు ఉభయ దాతలు, భక్తులు పాల్గొని తమ నామగోత్రాలతో హోమం జరిపించుకున్నారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యంశాస్త్రి, పవన్‌కుమార్ శర్మ నిర్వహించారు. భక్తులు, ఉభయదాతలకు ప్రసాద వితరణతో పాటు భక్తులకు అన్నప్రసాదం అందించారు.

నేడు అమరావతి కన్వెన్షన్ హాల్లో ఉగాది వేడుకలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విముదా ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్, లైన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఫైన్ ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు లయన్ డి దుర్గాప్రసాద్, డాక్టర్ రామ్ చంద్, లయన్ పి రమేష్, లయన్ అప్పారావు తెలిపారు. గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉగాదిని పురస్కరించుకుని విద్య, వైద్య, సామాజిక రంగాల్లో విశేష సేవలు అందించిన వారికి ఉగాది పురస్కారాలు అందజేయనునట్లు తెలిపారు. బందరు రోడ్డులోని విజయకృష్ణ సూపర్ మార్కెట్ వద్ద అమరావతి కన్వెన్షన్ లో జరిగే వేడుకలకు ముఖ్య అతిథిగా నూతన హీరోయిన్ శాంతి ప్రియ (దర్శిని మూవీ ఫేమ్) హాజరవుతారని తెలిపారు. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

మత సామరస్యాన్ని కాంక్షిస్తూ..


తెల్లవారుజామున షెహరీ విందు స్వీకరిస్తున్న ముస్లింలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మత సామరస్యాన్ని కాంక్షిస్తూ ముస్లింలకు సోమవారం తెల్లవారుజామున సహరీ విందును ఏర్పాటు చేశారు. సంపర తరుణ్ ఆధ్వర్యంలో కొంత మంది యువకులు బ్రాహ్మణ వీధిలోని ఎస్ఆర్ కన్వెన్షన్‌లో సోమవారం తెల్లవారుజామున మూడు గంటలకు సహరిని ఏర్పాటు చేశారు. సోమవారం ఉపవాస దీక్షను చేపట్టే 300 మందిని విందుకు ఆహ్వానించారు. ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే రంజాన్‌మాసంలో ఉపవాస దీక్ష చేస్తున్న వారికి తమ వంతుగా ఈ విందును ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. తరుణ్ స్నేహితులు ఏర్పాటు చేసిన విందు పట్ల ముస్లింలు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ముస్లీం యువకులకు ఈద్ ముబారక్‌ను తెలిపారు. కార్యక్రమాన్ని లంకలపల్లి మౌళి, షేక్.బాషా, షాజిద్, అహ్మద్, మినూ, నూరుద్దీన్, దినేష్, మనోజ్, ఫాజిల్ తదితరులు నిర్వహించారు.

ఎన్నికల నియమావళి సమర్థంగా అమలుకు చర్యలు


దావులూరు టోల్‌గేట్ వద్ద తనిఖీలు చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం


పోరంకిలో బస్సు తనిఖీ చేస్తున్న అధికారులు

కంకిపాడు: ఎన్నికల నియమావళి సమర్థంగా అమలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పేర్కొన్నాయి. దావులూరు టోల్‌గేట్, గోసాల హెచ్‌బీ పెట్రోల్ బంకు ప్రాంతాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు సోమవారం వాహన తనిఖీలు నిర్వహించాయి. స్క్వాడ్ అధికారులు ఉదయభాస్కర్, కనకమహాలక్ష్మి నేతృత్వంలో బృందాలు వాహనాలను తనిఖీ చేసి వాహనదారులకు నియమావళిపై అవగాహన కల్పించారు. కోడ్ ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. నగదు, ఆభరణాలు, ఎన్నికల సామగ్రి తరలింపునకు సంబంధించి పూర్తి అనుమతి పత్రాలు తమతో ఉంచుకోవాలని సూచించారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాగళ్ళ విద్యాకన్నా, సంస్థ ఉద్యోగులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): వేసవి కాలం సందర్భంగా తమ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి మే 2 తేదీ వరకు స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ళ విద్యాకన్నా చెప్పారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లో ఉన్న సంస్థ కార్యాలయంలో స్వయం ఉపాధి కోర్సులకు సంబంధించి బ్రోచర్‌ను సోమవారం ఆవిష్కరించారు. విద్యాకన్నా మాట్లాడుతూ ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ఫ్లవర్ మేకింగ్, మోహంది, హౌస్ డెకేరేటివ్ ఆర్టికల్స్, వాషింగ్ మెషిన్ లిక్విడ్స్, డిటర్జంట్స్ మేకింగ్, ఇన్‌స్టంట్ ఫుడ్ ఐటమ్స్, చాక్లెట్స్ మేకింగ్, న్యాచురల్ హెయిర్ ఆయిల్ అండ్ షాంపు తయారు చేసే కోర్సుల్లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ప్రతి రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తరగతులు జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 14 తేదీలోగా తమ సంస్థ కార్యాలయంలో నేరుగా కానీ 0866–2470420 నెంబరులో కానీ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. సంస్థ ప్రోగ్రామ్ ఆఫీసర్‌తో పాటుగా ఉద్యోగులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత ఉగాది తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ


త్రైత సిద్ధాంత తెలుగు క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర్ల దివ్య ఆశీసులతో త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్ –(త్రైతశకం –46) జిల్లా కలెక్టరు యస్.ఢిల్లీ రావు ఆవిష్కరించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి ప్రతినిధులు భగవద్గీత, హిందూ సంప్రదాయాల గ్రంథాలు కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ఈ గ్రంథాలు ఎంతో గొప్పవని, దైవ జ్ఞానం ఉన్నవని పేర్కొన్నారు. ఈ గ్రంథాలు చదవడం ద్వారా మానవుడు కర్మ నుంచి బయట పడవచ్చన్నారు. అనంతరం త్రైత శకం తెలుగు క్యాలెండర్‌లను పలువురికి వితరణ చేశారు. సమితి సభ్యులు తిరుపతి మాట్లాడుతూ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు స్వామి రచించిన ఈ జ్ఞాన తెలుగు కాలసూచికలో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి ప్రతి ఒక్కరికీ సరళమైన భాషలో అర్థం అయ్యే విధంగా రూపొందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సమితి, హిందూ జ్ఞాన వేదిక, విజయవాడ కమిటీ అధ్యక్షుడు సభ్యులు జె.సురేష్, తిరుపతి, సత్యం, పైడప్పుడు, దుర్గారావు , శంకర్ పాల్గొన్నారు.

మార్వాడీ యూనివర్సిటీలో అత్యుత్తమ విద్య


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న శ్రీధరన్, వెంకట వినయ్ చౌదరి, మహేంద్రనాయుడు

లబ్బీపేట(విజయవాడతూర్పు): దేశంలో ప్రముఖ విద్యా సంస్థల్లో ఒకటైన మార్వాడీ యూనివర్సిటీలో చదివిన విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారని ఆ యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ డీన్ డాక్టర్ ఆర్.శ్రీధరన్ అన్నారు. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో ఉన్న తమ యూనివర్సిటీలో అన్ని కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. లబ్బీపేటలో ఏర్పాటు చేసిన మార్వాడీ యూనివర్సిటీ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యాలయాన్ని సోమవారం డాక్టర్ ఆర్ శ్రీధరన్ లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు మంచి కోర్సులు అందించేందుకు ముందుకు వచ్చామని తెలిపారు. జాతీయ స్థాయిలో రాణించేందుకు యూనివర్సిటీలో బోధన, స్కిల్స్ దోహదం చేస్తాయని పేర్కొన్నారు. తమ యూనివర్సిటీలో 54 దేశాలకు చెందిన విద్యార్థులు ఉన్నట్లు వివరించారు. వెంకట వినయ్‌చౌదరి, ఆంధ్రా, తెలంగాణ ఇన్‌చార్జి ఎన్. మహేంద్రనాయుడులతో కలిసి యూనివర్సిటీలోని కోర్సుల బ్రోచర్‌ను ఉత్సాహంగా ఆవిష్కరించారు.

ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక


నూజివీడులోని మసీదులో ఇఫ్తార్ నమాజు చేస్తున్న చంటినాయన, ముస్లిం నాయకులు

నూజివీడు: పవిత్ర రంజాన్ మాసంలో ఉపదీక్షలో ఉండే ముస్లింల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువ నాయకులు మేకా వేణుగోపాల అప్పారావు (చంటి నాయన) అన్నారు. పట్టణంలోని రిజిస్ట్రార్ కార్యాలయం పక్కన ఉన్న మసీదులో సోమవారం రాత్రి ముస్లింలకు ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ ఇఫ్తార్ విందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న చంటినాయన మసీదులో ఇఫ్తార్ నమాజు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముస్లింలు పవిత్ర రంజాన్ మాసంలో భక్తి శ్రద్ధలతో ఉపదీక్షలు చేస్తారన్నారు. రంజాన్ పండుగ ముస్లీం జీవితాల్లో సుఖ సంతోషాలను నింపాలని అల్లాను కోరుకుంటున్నానన్నారు. ముస్లింల అభ్యున్నతికి ఆనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ఈనాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు మాత్రమే పాటుపడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ముస్లీం మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ యూనస్‌పాషా(గబ్బర్), ముస్లీం నాయకులు జాకీర్, అలీ, జలాల్, మౌలానా, ఖాసీం, సైదా, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు శీలం రాము, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యన్నారాయణ, కౌన్సిలర్ మీర్ అంజాద్ అలీ, నవుడు నాగమల్లేశ్వరరావు, నాయకులు మేకల అనిల్, వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షులు పిళ్లా చరణ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఐదుగురికి జరిమానా

గన్నవరం: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఐదుగురికి 12వ ఏఎంఎం కోర్టు జరిమానా విధించింది. వివరాల్లోకి వెళితే.. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గత కొన్ని రోజులుగా గన్నవరం ట్రాఫిక్ సీఐ వాసా పెద్దిరాజు నేతృత్వంలో సిబ్బంది స్థానికంగా పలు ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వీరిని 12వ అదనపు మేజిస్ట్రేట్ కోర్ట్‌లో ప్రవేశపెట్టగా జడ్జి ఐదుగురికి రూ.50 వేలు జరిమానా విధించారని చెప్పారు. ప్రమాదాల నివారణకు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం సేవించి, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం ప్రమాదకరం, చట్టరీత్యా నేరమన్నారు.

పోరంకిలో వాహనాల తనిఖీ

పెనమలూరు: ఎన్నికల సందర్భంగా పోరంకిలో ఆదివారం అర్ధరాత్రి వాహనాలను అధికారులు తనిఖీ చేశారు. ఎన్నికల సమయంలో అక్రమంగా సొమ్ము, మద్యం రవాణా జరగకుండా చర్యలు తీసుకోవటానికి మండల పరిధిలో పోరంకి, కానూరు, విజయవాడ–అవనిగడ్డ కృష్ణా కరకట్ట రహదారి, గోసాల, పెనమలూరు సెంటర్లలో విస్తృతంగా వాహనాల తనిఖీలు చేశారు. ప్రత్యేక టీమ్ అధికారి కోరా శ్రీనివాసరావు, పోలీసులు పాల్గొన్నారు. ఎటువంటి పత్రాలు లేకుండా సొమ్ము తీసుకు వెళ్లరాదని అధికారులు తెలిపారు. ఎన్నికలు ముగిసే వరకు వాహనాల తనిఖీ కొనసాగుతుందన్నారు.

ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన టిప్పర్ : కూలీకి తీవ్ర గాయాలు

గన్నవరం: వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్‌ను టిప్పర్ లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో ఓ మహిళా తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని కేసరపల్లి–సావరిగూడెం మధ్య సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం ప్రకారం... సావరిగూడెం గ్రామానికి చెందిన 30 మంది మహిళలు వ్యవసాయ కూలీ పనుల నిమిత్తం కంకిపాడు మండలం ఉప్పులూరుకు ట్రాక్టర్‌పై బయలుదేరారు. కేసరపల్లికి మార్గమధ్యంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్, ట్రాక్టర్‌ను ఓటర్‌టేక్ చేసే క్రమంలో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నేలపాల నాగేశ్వరమ్మ రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. స్థానికుల సమాచారం 108 సిబ్బంది అక్కడికి చేరుకుని క్షతగాత్రురాలిని పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై గన్నవరం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

తమ్మిన స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మాజీ శాసనసభ్యుడు తమ్మిన పోతరాజు విజయవాడ నగరానికి అందించిన సేవలు అపూర్వమని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అన్నారు. ఆయన స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలని కోరారు. కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత తమ్మిన పోతరాజు 42వ వర్ధంతి సోమవారం వన్‌టౌన్ లెనిన్ భవన్‌లో నిర్వహించారు. పోతరాజు చిత్రపటానికి దోనేపూడి శంకర్, నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ తమ్మిన పోతరాజు కూలి సంఘాలు, కార్మి సంఘాలు ఏర్పాటు చేసి పాతబస్తీ, వన్‌టౌన్‌లో అంటరానితనం, అస్పృశ్యతకు వ్యతిరేకంగా పోరాడిన సంఘ సంస్కర్త అని కొనియాడారు. ప్రతి డివిజనులో గ్రంథాలయాలను ఏర్పాటు చేసి యువతను చైతన్యవంతులను చేయడంతోపాటు సాంస్కృతిక పునరుజ్జీవనానికి పాటుపడ్డారని తెలిపారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన పోతరాజు కృషి వల్లే పాతబస్తీ, కొండ ప్రాంతాలు అభివృద్ధి చెందాయని వివరించారు. కనీసం సొంత ఇల్లు కూడా లేని నిస్వార్థ నాయకుడు అని కొనియాడారు. కార్యదర్శివర్గ సభ్యులు మూలి సాంబశివరావు, తాడి పైడియ్య, పంచదార్ల దుర్గాంబ, కొట్టు రమణారావు, కార్యవర్గ సభ్యులు సింగరాజు సాంబశివరావు, కొరగంజి దుర్గాంబ, పగడి కత్తుల రాము, మురిగేశన్ రాము పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే పేదల సంక్షేమం



ఆగిరిపల్లి, ఈదరలో ఇంటింటి ప్రచారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ నాయకులు

ఆగిరిపల్లి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పేదల అభివృద్ధికి సంక్షేమ పథకాలు అందించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అందరూ రుణపడి ఉన్నారని ఎంపీటీసీ సభ్యులు సాదం గోపి, వైఎస్సార్ సీపీ నాయకులు గోళ్ళ ఇస్సాకు అన్నారు. సోమవారం ఈదర, ఆగిరిపల్లిలో వారు ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేగా మేకా వెంకట ప్రతాప్ అప్పారావుని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని ఓటర్లను అభ్యర్థించారు. పేదల సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రెండో సారి ముఖ్యమంత్రిగా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సత్యం బాబు, గోళ్ళ ఇస్సాకు, కోటగిరి గోపాలకృష్ణ, కాపు సంఘం నాయకులు రామిశెట్టి సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ నక్కన బోయిన పండు, మైనార్టీ నాయకులు నాగుల్ మీరా, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.